ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన బాలికలు

ఖమ్మం సిటీ, అక్టోబర్ 28: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-14, అండర్-17 కేటగిరీల్లో బాలబాలికల ఎంపికలను సోమవారం నిర్వహించారు. 60 మంది క్రీడాకారులు హాజరవ్వగా.. బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ హరీశ్, పీడీ సైదేశ్వరరావు, పీఈటీ వీరరాఘవయ్య పర్యవేక్షించారు. అనంతరం ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నరసింహామూర్తి, నరేశ్‌కుమార్ ఎంపికల జాబితాను ప్రకటించారు. ఆయా పోటీలు భద్రాద్రి కొత్తగూడెంలో జరుగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడి ఖమ్మంలో నిర్వహించారు.

ఎంపికైన క్రీడాకారులు..

- **అండర్-14 బాలురు:** వీ.మెగావర్షిత్, కే.విష్ణుతేజ, ఎస్.స్వప్నిల్, దీక్షిత్, ఎండీ షాయనాబేగం
- **అండర్-14 బాలికలు:** వీ.నిత్య, ఎం.చరితశ్రీ, జే.అవంతిక, పీ.రోదగ్రాస్, జీ.భావన, కార్తీక
- **అండర్- 17 బాలురు:** డీ.తేజస్ వివేక్, ఏ.వినయ్, బీ.విశ్వ తేజస్, కే.మోహనకృష్ణ, కే.పార్థసారథి
- **అండర్-17 బాలికలు:** కే.గగన్ శ్రీ, బీ.రిత్విక శ్రీ, వై.దివ్య శ్రీ, జీ.జెస్సీ

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలి: ఏవో

కొణిజర్ల, అక్టోబర్ 28: మిరపలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏవో బాలాజీ రైతులకు సూచించారు. కొణిజర్లలోని మిరపతోటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిరపలో వీలున్నంత వరకు పైపాటు చేసుకోవాలని, దీనివల్ల భూమిలో ఉన్న వేరు కదలటం వల్ల గాలి, నీరు, పోషకాలు తీసుకొని మిరప ఏపుగా పెరుగుతుందని వివరించారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనిఖీలు: బీఆర్ఎస్

కారేపల్లి, అక్టోబర్ 28: ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది ఇంట్లో ప్రభుత్వం తనిఖీలు చేయిస్తోందని బీఆర్ఎస్ నాయకుడు, దిశ కమిటీ మాజీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ ఆరోపించారు. కేటీఆర్‌ను టార్గెట్ చేసినందునే పోలీసులను ఉసిగొల్పి తప్పుడు ఆరోపణలు చేయిస్తోందని మండిపడ్డారు. కారేపల్లిలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహప్రవేశ వేడుకను రేవ్ పార్టీ అంటూ తప్పుడు ప్రచారం చేయడం తగదని అన్నారు.

28కేఆర్‌పీఎల్03ః కారేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీ నాయకులు

ఎన్నికల హామీలను అమలు చేయాలి: ఎన్‌డీ

కారేపల్లి, అక్టోబర్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటుధర కల్పించాలని కోరారు. ఈ మేరకు కారేపల్లిలో ఆ పార్టీ నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఎన్ గార్డెన్‌లో జరిగిన సభలో ఎన్డీ రాష్ట్ర నాయకుడు అరెల్లి కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతున్నా హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. నాయకులు పోలూరి శ్రీనివాస్, భూక్యా శివ నాయక్, బానోత్ రాంసింగ్, ఓగురి వెంకన్న, సతీశ్, రాజి, లాలు, నాగమణి, శిరీష, భీమిరెడ్డి, గుర్రం సత్యం పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా పసుమర్తి

పెనుబల్లి, అక్టోబర్ 28: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా కల్లూరుకు చెందిన పసుమర్తి చందర్‌రావును సోమవారం ఎన్నుకున్నారు. చందర్‌రావు జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

28ఎస్‌పీఎల్‌టౌన్02ః సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

బాధిత కుటుంబాలకు మంత్రి తుమ్మల పరామర్శ

సత్తుపల్లి/ పెనుబల్లి, అక్టోబర్ 28: సత్తుపల్లికి చెందిన చీకటి ధర్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం సాయిబాలాజీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ధర్మయ్య దశదిన కర్మకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై ధర్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే, పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన మాచినేని కృష్ణయ్య ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు: డీఎం

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 28: ఆర్టీసీ లిజిస్టిక్ పార్సిళ్లను ఇంటి వద్దకే చేరవేస్తున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. సత్తుపల్లి డిపోలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని 31 ప్రాంతాల్లో వినియోగదారులకు ఈ అవకాశం కల్పించామని, సత్తుపల్లి డిపో పరిధిలోని పార్సిల్‌ను బుకింగ్ చేసుకునే కష్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9154298585 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తుపల్లి డిపోలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రయాణికులు 99592259 62 నంబరుకు ఫోన్ చేసి సూచనలు, సలహాలు తెలపాలని కోరారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపినస్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **గమ్మా నాగేశ్వరరావు** S/o: **వెంకయ్య, వయస్సు:** 50సం॥లు, **వృత్తి:**వ్యవసాయం, **నివాసం:** కొత్తనారాయణపురం గ్రామం, కల్లూరు మండలం, జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 8 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: ఖమ్మం జిల్లా రిజిష్ట్రారు, జిల్లా పరిషత్ ఖమ్మం, కల్లూరు సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసు పరిధిలోని కల్లూరు మండలం, నారాయణపురం గ్రామపంచాయితీ, నారాయణపురం గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా య॥ 1-09కుంటల భూమి మింజామలే, సర్వే నెం.94, **డాక్యుమెంట్:**149/2013, ప్లాట్ నెం.4 దాఖలా విస్తీర్ణం : 363 చ॥గ॥లకు, సమానమగు 332.00చ॥మీ॥ ల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు :** 9వ నెంబరు గల ప్లాట్, **పడమర:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం :** రోడ్డు, **దక్షిణము :** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

'భట్టి' దృష్టిలో పడేందుకు పోలీసుల ఆతృత

- అలా చేస్తే ఆంధ్రాలో పోలీసులకు పట్టిన గతే వీరికీ పడుతుంది
- కొందరైతే మూడు రంగుల కండువా కప్పుకున్నట్లుగా పనిచేస్తున్నారు : తమ్మినేని

సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బోనకల్లు, అక్టోబర్ 28: కొందరు పోలీసు అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టిలో పడాలనే ఆతృతతో తమ విధులను విస్మరిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. అలా చేస్తే ఆంధ్రాలో ఐపీఎస్‌లకు పట్టిన గతే ఈ రాష్ట్రంలోనూ పడుతుందని హెచ్చరించారు. ఆ పార్టీ నాయకుడు ఎర్రబోయిన నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని గోవిందాపురం (ఎల్) గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. నాగేశ్వరరావు వర్ధంతి సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుందన్నారు. కొందరు పోలీసులు మూడు రంగుల కండువాలు కప్పుకున్నట్లుగా పని చేస్తున్నారని, దీనిని సహించబోమని అన్నారు. ఒక వేళ అంత ప్రేమ ఉంటే.. పోలీసు చొక్కా తీసివేసి కాంగ్రెస్ నాయకుల్లా పనులు చేసుకోవాలని హితవుచెప్పారు. పోలీసు డ్రస్ వేసుకొని కాంగ్రెస్ నాయకుల్లా వ్యవహరిస్తే తమ పార్టీ కార్యకర్తలు తగిన విధంగా వ్యవహరిస్తారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని అన్నారు. అలాగే రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు రుణమాఫీ చెల్లించాల్సి ఉండగా.. రూ.18 వేల కోట్లు మాత్రమే చెల్లించి రైతుల రుణమాఫీ చేశామని సీఎం ప్రకటించడం హాస్యాస్పదమని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చితే చూస్తూ ఊరుకోబోమని, గ్రూప్-1 పరీక్షల్లో అభ్యర్థుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. సీపీఎం నాయకులు బండి రమేశ్, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, ఎనిగళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజమే ప్రత్యామ్నాయం: తమ్మినేని

కొణిజర్ల, అక్టోబర్ 28: రాబోయే రోజుల్లో ప్రపంచానికి మార్క్సిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని చిన్నమునగాలలో సోమవారం జరిగిన పార్టీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందని అన్నారు. నున్నా నాగేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, కొండెబోయిన నాగేశ్వరరావు, చింతల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబర్ 28: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం 19వ డివిజన్ ఏకలవ్యనగర్, బోనకల్ రోడ్ నెంబర్-7లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.55 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలని, లెవెలింగ్ సరిగ్గా ఉండాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రాయల నాగేశ్వరరావు, నీరజ, అభిషేక్, గణేశ్, వెంకటనారాయణ, మురళి, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

సత్తుపల్లి/ పెనుబల్లి, అక్టోబర్ 28: సత్తుపల్లి మండలంలోని అయ్యగారిపేట, పెనుబల్లి మండలం కుప్పెకుంట్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ ఆనంద్, ఏవో శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఏవో ప్రసాదరాజు, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజప్రభాకర్‌చౌదరి, ఏపీఎం నాగ పుల్లారావు పాల్గొన్నారు.

'లంకాసాగర్'లో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే

పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ ప్రాజెక్టులో 6 లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం వదిలారు.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బొల్లికొండ

ఖమ్మం సిటీ, అక్టోబర్ 28: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖమ్మానికి చెందిన డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయన జయకేతనం ఎగురవేశారు. ప్రస్తుతం ఆయన స్తంభాద్రి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా సైతం సేవలు అందిస్తున్నారు.

గుండెపోటుతో కార్పొరేటర్ మలీదు జగన్ మృతి

రఘునాథపాలెం, అక్టోబర్ 28: ఖమ్మం 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్మోహన్‌రావు (50) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. ఆదివారం గుండెపోటు రావడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందారు. జగన్మోహన్‌రావుకు భార్య నాగమణి, కుమారులు ప్రణీత్, మనీష్ ఉన్నారు. వీరు విదేశాల్లో ఉన్న కారణంగా భౌతికకాయాన్ని హైదరాబాద్ ఆసుపత్రిలో భద్రపరిచారు. బుధవారం అంత్యక్రియలు ఖమ్మంలోని స్వగ్రామం బల్లేపల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

విజిలెన్స్ సిబ్బంది ప్రతిజ్ఞ

మామిళ్లగూడెం, అక్టోబర్ 28: కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఖమ్మంలో వినియోగదారుల విజిలెన్స్ సిబ్బంది ఆధ్వర్యంలో సమగ్రతా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటా సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశ శ్రేయస్సు కోసం సమగ్రత సంస్కృతి అనే థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల 28 నుంచి నవంబర్ 3 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు లవన్‌కుమార్, రాయప్ప, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, హీరాలాల్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలకు పరిష్కారం చూపాలి: కమిషనర్

ఖమ్మం, అక్టోబర్ 28: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు గ్రీవెన్స్‌లో అందజేసిన ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ సూచించారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలువురు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతులు అందజేశారు. వాటన్నింటిని ఆయా శాఖల అధికారులకు పంపిన కమిషనర్ వెంటనే పరిష్కారం కనుగొనాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్, రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.

చివరి లబ్ధిదారుడికీ ప్రభుత్వ ఫలాలు అందాలి: కలెక్టర్

మామిళ్లగూడెం/ ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 28: అర్హతగల చిట్టచివరి లబ్ధిదారుడికి కూడా ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. తెలంగాణ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థ ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులో భాగంగా క్షేత్ర పరిశీలన కోసం వచ్చిన ఆలిండియా సర్వీసెస్, సెంటర్ సివిల్ సర్వీసెస్-2024 అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో విద్య, వైద్యపరంగా తీసుకున్న చర్యలు గురించి వివరించారు. ఈ నెల 21 నుంచి 28 వరకు జిల్లా క్షేత్ర పరిశీలనలోని వారి అనుభావాలను కలెక్టర్‌తో సదరు అధికారులు పంచుకున్నారు.

పశుగణనను పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్

జిల్లాలో పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 21వ అఖిలభారత పశుగణన 2024 పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

రఘునాథపాలెం, అక్టోబర్ 28: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మం గోపాలపురం రమేశ్ దాబా వద్ద చోటుచేసుకుంది. ఖానాపురం సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. ఏన్కూరు మండలం రాంనగర్ తండాకు చెందిన భూక్యా రాజేశ్ (21) ఖమ్మం శివారులోని ఓ ప్రైవేటు పాఠశాలలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. రాజేశ్ సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో వైరా రోడ్డులోని రమేశ్ దాబా వద్ద ప్రధాన రహదారి పక్కన చనిపోయి కనిపించాడు. ఈ విషయాన్ని మిత్రుడైన అజ్మీరా చంటి.. రాజేశ్ తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. తండ్రి భూక్యా కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, రాజేశ్ మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు పాఠశాల ఎదుట ఆందోళన చేశారు.

కేయూ క్రికెట్ టోర్నీలో సత్తాచాటిన కేఎండీసీ

ఖమ్మం సిటీ, అక్టోబర్ 28: ఇటీవల ఖమ్మంలో జరిగిన కాకతీయ యూనివర్సిటీ పరిధి ఖమ్మం జోన్ క్రికెట్ పోటీల్లో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయం సాధించింది. అయితే, తమ కళాశాల విద్యార్థులు రాణించడం పట్ల సోమవారం కేఎండీసీ కళాశాల కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణారావు, పీడీ జే ఉపేందర్, అధ్యాపకులు రంగారావు, ఉపేందర్, కమల్, సతీశ్ హర్షం వ్యక్తం చేశారు.

ఒలింపియాడ్‌లో సత్తాచాటిన 'శ్రీచైతన్య' విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 28: జాతీయస్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (క్యాట్) ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో ఖమ్మం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. 398 మంది ప్రథమస్థాయిలో ఉత్తీర్ణత సాధించి ద్వితీయ పరీక్షకు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్‌మాథుర్, ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ అభినందించారు.

టేబుల్ టెన్నిస్‌లో 'సర్వజ్ఞ' విద్యార్థుల ప్రతిభ..

ఖమ్మంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్‌లో విజయకేతనాన్ని ఎగురవేశారని డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్ సోమవారం తెలిపారు. అండర్-14 డబుల్స్, సింగిల్స్‌లో పసిడి, కంచు పతకాలను సాధించారన్నారు. విద్యార్థులను డైరెక్టర్ నీలిమ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏటీసీ కోర్సుల అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 28: జిల్లాలోని ఐటీఐల్లో ఏర్పాటుచేస్తున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సుల ప్రవేశాల కోసం ఈ నెల 30 గడువని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వెంటనే ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 172 సీట్లలో 147 భర్తీ కాగా 25 మాత్రమే ఖాళీ ఉన్నట్లు చెప్పారు.

చిట్టెమ్మకు లింగాల, కొండబాల నివాళి

నివాళులర్పిస్తున్న లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం, అక్టోబర్ 28: మండలంలోని మొలుగుమాడు గ్రామానికి చెందిన ఖరీదు చిట్టెమ్మ ఇటీవల మృతిచెందగా సోమవారం ఆమె దినదినకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు హాజరై ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు చావా రామకృష్ణ, కృష్ణారావు, రామకోటేశ్వరరావు, పంబి సాంబశివరావు, మల్లికార్జున్‌రెడ్డి, సాంబశివరావు, కృష్ణారెడ్డి, పవన్, పోల్‌రాజు, కిశోర్‌బాబు, వెంకటేశ్వరావు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, రవి, నాగిరెడ్డి, వెంకయ్య, ప్రకాశ్, లోకేశ్, బాబురావు, నాగేశ్వరరావు, గంగాధర్ తదితరులు కూడా పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పాఠశాలకు బెంచీల వితరణ

మధిర రూరల్, అక్టోబర్ 28: మండల పరిధిలోని ఇల్లూరు జడ్పీహెచ్ఎస్‌కు పూర్వ విద్యార్థి దుగ్గినేని భాస్కరరావు.. తన తండ్రి దుగ్గినేని వెంకయ్య జ్ఞాపకార్థం రూ.73 వేల విలువైన డెస్క్ బెంచీలను సోమవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రషీద్.. దాతను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్లన్నీ వెంటనే ఇవ్వాలి: యూటీఎఫ్

కూసుమంచి (నేలకొండపల్లి), అక్టోబర్ 28: ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన వెంటనే బెనిఫిట్లన్నీ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. నేలకొండపల్లిలో సోమవారం జరిగిన ఉపాధ్యాయుడు గోవింద రావు సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. సంఘం నాయకులు నాగమల్లేశ్వరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నెల్లూరి వీరబాబు, రాజశేఖర్, సురేశ్, అరవింద్, గురవయ్య, రవీందర్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్, ఖమ్మం ఆర్డీవో బదిలీ

మామిళ్లగూడెం, అక్టోబర్ 28: రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవో స్థాయి అధికారులకు స్థానచలనం కల్పిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో ముగ్గురు ప్రధాన అధికారులు బదిలీ అయ్యారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్‌నాయక్ మహబూబ్‌నగర్ జిల్లాలోని భీమా ప్రాజెక్టు భూసేకరణ విభాగానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. సిద్ధిపేట అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాసరెడ్డిని ఖమ్మం అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. నిర్మల్ భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పనిచేస్తున్న వి.భుజంగరావును ఖమ్మం డీఆర్‌వోగా నియమించారు. ఖమ్మం ఆర్డీవోగా పనిచేస్తున్న గుంటుపల్లి గణేష్‌ను తొర్రూరు ఆర్డీవోగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న జి.నరసింహరావును ఖమ్మం ఆర్డీవోగా బదిలీ చేశారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి

రఘునాథపాలెం, అక్టోబర్ 28: ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన సోమవారం శివాయిగూడెం సమీపంలో చోటుచేసుకుంది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. శివాయిగూడేనికి చెందిన గార్లపాటి విజయరావు (24) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ సోమవారం ఉదయం ప్రయాణికులను ఎక్కించుకొని ఖమ్మం నుంచి వస్తున్నాడు. శివాయిగూడెం సమీపానికి చేరుకోగానే ఎదురుగా మహారాష్ట్రకు చెందిన లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ విజయరావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీడ్రైవర్ రాజుకరన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పెద్దాసుపత్రి విభాగాల్లో ఏసీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఖమ్మం సిటీ, అక్టోబర్ 28: జిల్లా సార్వజనీన ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఏసీల ఏర్పాటుకు సంబంధిత వైద్యాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఐసీయూ, ఏఎంసీ, ఎస్ఎంసీయూ, ఆరోగ్యశ్రీ వార్డు, కార్డియాక్ ఐసీయూ, సర్జికల్ ఐసీయూ